క్లుప్తంగా

శ్రీపేరంటాలమ్మ సేవలో ఎమ్మెల్యే యార్లగడ్డ



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సతీసమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు దంపతులు పేరంటాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు వెంకట్రావును ఆలయ మర్యాదలతో ఆహ్వానించి అమ్మవారి శేష వస్త్రం అందజేశారు. అనంతరం ఆషాఢ మాస ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో మహిళా భక్తులు సామూహికంగా అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. కార్యక్రమంలో ప్రసాదంపాడు సర్పంచ్ సర్నాల గంగారత్నం బాలాజీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

17న చినకంచిలో ప్రత్యేక పూజలు

నున్న(విజయవాడరూరల్): తొలి ఏకాదశి సందర్భంగా ఈ నెల 17వ తేదీన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి దేవస్థానం చినకంచిలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ మొక్కపాటి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి ఏకాదశి నాడు విష్ణుమూర్తికి ప్రీతికరమైన పేలాల పిండిని ప్రసాదంగా పెట్టడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా భక్తులు కూడా పేలాలపిండి తీసుకుని ఉపవాసం ఉంటారని తెలిపారు. విష్ణుమూర్తి తొలిఏకాదశి రోజు నుంచి రెండు నెలల పాటు అనగా కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నిద్రలో ఉంటారు. విష్ణు ఆలయాల్లో శ్రీ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు, అర్చనలు చేస్తారని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా శాకంబరీ ఉత్సవం



గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేంచేసి ఉన్న శ్రీసీతా రామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం శాకంబరీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఉప ఆలయంలోని శ్రీసరస్వతి అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో సుమారు 300 మంది మహిళలతో కుంకుమార్చనలు నిర్వహించారు. శాకంబరీ ఉత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వివిధ రకాలు కూరగాయలు, ఆకుకూరలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు కదంబం ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు, పలువురు గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

తాడిగడపలో బాలిక అదృశ్యం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో బాలిక అదృశ్యంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు తాడిగడప ఇంజినీరింగ్ కాలేజీ ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న వ్యక్తికి భార్య, ఇద్దరు పిల్లలు. కాగా ఇతని కుమార్తె (16) ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం ఆటోనగర్ గేట్ వద్ద ఉన్న తన స్నేహితురాలి ఇంటికి వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. దీంతో బాలికకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆటోనగర్ గేట్ వద్ద ఉన్న స్నేహితురాలి ఇంటికి వెళ్లి వాకబు చేయగా ఆ బాలిక కూడా అదృశ్యమైనట్లు గుర్తించారు. ఇద్దరూ ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయారు. ఈ ఘటనపై మొదటి బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరో ఘటనలో..

పెనమలూరు: తల్లి కనబడటం లేదని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌కు చెందిన కాజ వెంకటేష్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతనితో పాటు తల్లి కాజ వాణి(45) ఉంటుంది. ఆమెకు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. కాగా ఈ నెల 12వ తేదీ ఉదయం నిద్రలేచి చూడగా వాణి ఇంట్లో కనబడలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మానవతా సంస్థ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉయ్యూరు: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉయ్యూరు శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. స్థానిక సేవా సంస్థ కార్యాలయంలో సభ్యులు నూతన అధ్యక్షుడిగా ఎస్.రాజేష్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పి.శివకృష్ణ, కోశాధికారిగా ఎస్.మహేష్, కార్యదర్శిగా సలీం, సహాయ కార్యదర్శిగా పి.స్వామితో కూడిన నూతన కార్యవర్గాన్ని ప్రకటించి అభినందనలు తెలిపారు.







అమ్మకు బంగారు బోనం



బెజవాడ దుర్గమ్మకు హైదరాబాద్ భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆదివారం బంగారు బోనం సమర్పించింది. బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి ఆవరణలో రావిచెట్టు వద్ద ముందుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, జోగినీలు, పోతురాజు విన్యాసాలు, కళాకారులు, నృత్య ప్రదర్శనగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని బంగారు బోనం, పూజా సామగ్రిని సమర్పించారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో ఉన్న అమ్మ వయో వృద్ధాశ్రమంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా దండమూడి శ్రీనివాసరావు, కార్యదర్శిగా శ్రీరామ్ శ్రీనివాస్, కోశాధికారిగా చెరుకూరి షీలా బాధ్యతలు స్వీకరించారు. వీరితో లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మిర్యాల వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో లయన్స్‌క్లబ్ కీలక పాత్ర వహిస్తుందన్నారు. పేద వర్గాలకు విద్య, వైద్యంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు లయన్స్‌క్లబ్ అండగా నిలుస్తుందన్నారు. లయన్స్ సేవలను మరింత విస్తృతం చేయడంలో యువత కూడా భాగస్వాములు కావాలని కోరారు. క్లబ్ నూతన కార్యవర్గం మరింత అంకిత భావంతో పనిచేసి తమ సేవల ద్వారా ప్రజల మన్ననలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ కోశాధికారి చలసారి ఈశ్వర్, సభ్యులు ఎంఎల్ఎస్ఆర్‌కె. ప్రసాద్, మూల్పూరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలకు పూజలు



వీరవల్లి వద్ద ఏలూరు కాలువలో గోదావరి జలాలకు పూజలు నిర్వహిస్తున్న రైతు నాయకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణా-ఏలూరు కాలువ ద్వారా విడుదల చేసిన సాగునీరు బాపులపాడు మండలం వీరవల్లికి చేరుకోవడంతో ఆదివారం సాగునీటి సంఘాలు, రైతు నాయకులు పూజలు నిర్వహించారు. గోదావరి జలాలను పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు అందించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఏలూరు కాలువ 38వ కిలోమీటరు వద్ద గోదావరి జలాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, హారతి ఇచ్చారు. సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, రైతు నాయకుడు గుండపనేని ఉమావరప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు అమృతపల్లి సూర్యనారాయణ, పూసులూరి లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఏఈఈ ఎల్.తనూజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ వై.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు



హారతులు ఇస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి



శాకంబరీ అలంకారంలో అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం వారాహి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని పలు రకాల కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకారం చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించారు. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారికి పూజలు చేస్తున్నామన్నారు. ఎంతో మహిమాన్వితమైన అమ్మవారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయని చెప్పారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. అమ్మవారికి పారాయణం, అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి, మందిర కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరంలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో దోమల నివారణకు నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. 64వ డివిజన్‌లోని కండ్రిక, ప్రజాశక్తి నగర్, రాధానగర్ ప్రాంతాల్లో ఆదివారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో దోమల నివారణ మందును స్ప్రే చేయించారు. ఇళ్ల మధ్య నిల్వ ఉన్న వర్షం నీటిని దగ్గర్లో ఉన్న డ్రెయినేజీ కాల్వల్లోకి పంపడం, వీలుకాని ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందకుండా నివారణకు మందు స్ప్రే చేస్తున్నారు. 63వ డివిజన్ రాజీవ్ నగర్, న్యూ రాజీవ్‌నగర్, డాక్టర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీ కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా పారిశుద్ధ్య కార్మికులు వ్యర్థాలను తొలగించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి..

ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాజీవ్‌నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాథోడ్ రాజా ప్రజలకు సూచించారు. ఇంటివద్ద నీటి తొట్టెల్లో, పాత టైర్లలో, కొబ్బరి బొండాల్లో రోజుల తరబడి నీరునిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమ తెరలతో పాటు శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులను ధరించాలని చెప్పారు. జ్వరం, దగ్గు, తీవ్రమైన తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలోని వైద్య కేంద్రానికి వెళ్లి వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. అదేవిధంగా కీళ్ల నొప్పులు, డీహైడ్రేషన్, వాంతులు, విరోచనాలు, బలహీనంగా అనిపించడం, కడుపులో నొప్పి ఉంటే అవి డెంగీ వ్యాధి లక్షణాలుగా గుర్తించి, వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచిన వేడినీటిని తాగాలని, చల్లటి, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోరాదని వైద్యులు సూచించారు.

జ్యోతి పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ఉయ్యూరు: ఉయ్యూరు మండలం కలవపాముల గ్రామ సమీపంలో ఉన్న శ్రీ జ్యోతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అకడమిక్ ఇయర్ మొదటి సంవత్సర ఫలితాల్లో విశేష ప్రతిభ చాటారు. రాష్ట్ర సాంకేతిక మండలి విడుదల చేసిన 2023–24 అకడమిక్ ఇయర్ ఇంజినీరింగ్ ఫస్టియర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. డ్రాయింగ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం విభాగాల్లో నూరు శాతం ఉత్తీర్ణత కనబరిచారు. విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచారని, కళాశాలలో చేపడుతున్న విద్యా సంస్కరణలు, బోధన పద్ధతులే ఇందుకు కారణమని ప్రిన్సిపాల్ జె.శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ ఎస్వీ రమణ, ప్రిన్సిపాల్ శివకుమార్ అభినందించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

పెనమలూరు: యనమలకుదురులో చట్ట విరుద్ధంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఎస్ఈబీ అధికారులు సీజ్ చేశారు. యనమలకుదురు ఇసుక క్వారీ కనకదుర్గ వారధికి దగ్గరగా ఉండటంతో ఈ క్వారీని గతంలోనే నిషేధించారు. అయితే ఇసుక మాఫియా అధికార పార్టీ అండదండలతో అడ్డగోలుగా ఇసుకను తరలిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్ఈబీ అధికారులు ఆదివారం దాడులు చేసి మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేశారు. కాగా చోడవరం ఇసుక క్వారీలో కూడా అడ్డగోలుగా ఇసుక తరలిస్తున్నారు. ఎస్ఈబీ, రెవిన్యూ, పోలీసు అధికారులు తక్షణం చర్యలు తీసుకోకపోతే కృష్ణా నదిలో భూగర్భజలాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

రామకృష్ణాపురంలో శ్లోక పఠన శిక్షణ తరగతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ 30వ డివిజన్ రామకృష్ణాపురంలో ఆదివారం శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన శ్లోక పఠన శిక్షణ తరగతులు జరిగాయి. విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూర్యాష్టకం, భగవద్గీత 5వ అధ్యాయం, నవగ్రహ స్తోత్రం తదితర అంశాలను నేర్పించారు. అలాగే హిందూ ధర్మం గురించి వాటిని ఆచరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. విద్యార్థి దశ నుంచే భక్తిభావం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉత్సాహంగా శ్లోకాలు నేర్చుకున్నారు.

నటీనటుల్లోని ప్రతిభను ప్రోత్సహించాలి



సినీ నటి ఊర్వశీ పటేల్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: నటీనటుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. జేఎంఎస్ సరాగాలు ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సినీ సంగీత విభావరి, సినీ నటి ఊర్వశీ పటేల్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ.. ప్రతిభ ఏ రూపంలో ఉన్నా తెలుగు వారు ఆదరిస్తారన్నారు. గాయకుడు మారేపల్లి జోషి మాట్లాడుతూ.. తన ప్రతిభను పలు సినిమాల్లో ప్రదర్శించిన పటేల్‌ను అభినందించారు. సంస్థ నిర్వాహకులు ఝాన్సీ సంస్థ లక్ష్యాలను వివరించారు. సినీ నటి ఊర్వశీ పటేల్ మాట్లాడుతూ.. తెలుగు వారి ప్రేమ అనిర్వచనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, కారుమంచి రాజు తదితరులు పాల్గొన్నారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు చిత్ర గీతాలను ఆలపించారు.

ముళ్ల పొదలు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించిన తర్వాత రైల్వేస్టేషన్‌కు వెళ్లు రోడ్డు మార్గం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు రైల్వేస్టేషన్‌కు వెళ్లు రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ప్రయాణికులు, గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 13న 'ముళ్ల పొదలు తొలగించండి సారూ' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రాత్రుళ్లు ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు పడుతున్న అవస్థలు, పొదల మాటున విషసర్పాల సంచారం, ఈ ప్రాంతంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు వంటి సమస్యలను కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో పంచాయతీ అధికారులు స్పందించి జేసీబీతో రోడ్డుకు ఇరు వైపులా ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. ప్రయాణికులు రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నారు. గత కొన్నాళ్లుగా పరిష్కారంకాని సమస్యను సాక్షి చొరవతో పరిష్కరించడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎడతెరపిలేని వర్షంతో అవస్థలు



తెంపల్లిలో వర్షానికి చిత్తడిగా మారిన రోడ్డు

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కురిసిన ఎడతెరపి లేని వర్షంతో ప్రజలు అవస్థలు పడ్డారు. గ్రామాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. వాహనదారులు రోడ్లపై ఉన్న గుంతలతో ఇక్కట్లు పడ్డారు. గన్నవరం నుంచి పురుషోత్తపట్నం, ముస్తాబాద - సావరగూడెం, పెద అవుటపల్లి - తెంపల్లి, వీరపనేనిగూడెం రోడ్లు మురుగునీటితో నిండిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ జల్లులు పడుతూనే ఉండటంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని రోడ్లపై గోతులు పూడ్చాలని పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మహమ్మద్ ఇక్బాల్ సేవలు ప్రశంసనీయం



ఇక్బాల్ దంపతులను సన్మానిస్తున్న నేతలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్‌కు మహమ్మద్ ఇక్బాల్ అందించిన సేవలు ప్రశంసనీయమైనవని పలువురు వక్తలు కొనియాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ పశ్చిమ కృష్ణా కార్యదర్శి మహమ్మద్ ఇక్బాల్ మూడు నెలల కిందట పదవీ విరమణ చేయగా, ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ, ఐఅండ్‌పీఆర్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు శివారెడ్డి, పురుషోత్తమచౌదరిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీ ఎన్జీవోస్ తలపెట్టిన ప్రతి కార్యక్రమంలో పాల్గొని సంఘ బలోపేతానికి ఇక్బాల్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయనను నేటితరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ పశ్చిమ కృష్ణా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో వ్యక్తి గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురానికి చెందిన బాలిపిల్లి చిరంజీవి(55) బీఆర్టీఎస్ రోడ్డులోని రామకృష్ణ వృద్ధాశ్రమంలో పని చేస్తున్నారు. శనివారం రాత్రి 9.30 గంటలకు కేంద్రీయ విద్యాలయం సమీపంలో చిరంజీవిని ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన చిరంజీవిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చిరంజీవి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.